## ‘మర్రి’కి బిగిస్తున్న ఇడి ఉచ్చు

ప్రజాపక్షం/హైదరాబాద్: భూదాన్ భూముల కుంభకోణం కేసులో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ మర్రి జనార్ధన్‌రెడ్డికి ఉచ్చు భిగిస్తుంది. ఈ కేసులో అప్పటి రంగారెడ్డి, మల్కాజ్‌గిరిమేడ్చల్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను ఇడి అధికారులు ఐదు సార్లు విచారించారు. ఈ విచారణలో భూదాన్ భూముల కుంభకోణంలో చివరగా లబ్ది పొందింది మర్రి జనార్ధన్‌రెడ్డి అని తేలింది. దీంతో ఆయనతో పాటు వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి, కేఎస్ఆర్ మైన్స్‌కు చెందిన కె.సిద్ధారెడ్డి, అమ్మద డెవలపర్స్‌కు చెందిన సూర్యతేజలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఇడి అధికారుల ముందు మర్రి జనార్ధన్‌రెడ్డితో పాటు వీరంతా విచారణకు హాజరుకావాల్సి ఉంది. వీరిని విచారిస్తే ఈ కుంభకోణంలో మరికొంత మంది నేతల పేర్లు బయటపడే అవకాశాలు ఉన్నాయి. నాగారంలోని 50 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్ కేసులో ఇడి గత రెండు నెలల నుంచి దూకుడు పెంచింది. ఈ కుంభకోణంలో రూ. 1000 కోట్ల విలువైన భూదాన్ భూములను ప్రైవేటు పరం చేసినట్టు అమోయ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. అమోయ్‌కుమార్ ద్వారానే జనార్ధన్రెడ్డి, వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి లబ్ధిపొందినట్టు తేలింది. అమోయ్ కుమార్ ద్వారా వీరంతా లబ్ధిపొందినట్టు ఇడి గుర్తించినట్టు తెలిసింది. భూదాన్ భూములను ప్రైవేటు పట్టా భూములుగా మార్చి వాటికి రిజిస్ట్రేషన్లు జరగడం వెనుక వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. దస్తగిరి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పుడీ కేసు ఇడి చేతుల్లోకి వెళ్లింది.

# పదవీచ్యుతుడైన యూన్

## ప్రధానమంత్రికే దక్షిణ కొరియా అధ్యక్ష బాధ్యతలు



తాత్కాలిక అధ్యక్షుడు హాన్‌డక్

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను నేరస్థుడుగా పరిగణిస్తూ ఆ దేశ పార్లమెంటు తీర్మానం చేసింది. దీంతో ఆయన పదవీచ్యుతుడయ్యారు. ఆయన స్థానంలో ప్రధానమంత్రి హాన్‌డక్ సూ తాత్కాలికంగా అధ్యక్ష పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు. 2022 మే నెలలో ప్రధానమంత్రిగా హాన్ డక్ సూ బాధ్యతలు చేపట్టారు. యూన్ సుక్ యోన్ పదవీచ్యుతుడు కావడంతో శనివారం నుండి హాన్ డక్ సూ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ప్రతిపక్షం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శనివారంనాడు సభ ఆమోదించింది. ఈ తీర్మానాన్ని న్యాయస్థానం పరిశీలనకు పంపిస్తారు. ఈ తీర్మానాన్ని న్యాయస్థానానికి పరిశీలనకు పంపితే నిర్ణయం వెలువడటానికి దాదాపు 180 రోజులు పడుతుంది. ఒకవేళ దేశాధ్యక్షుణ్ణి న్యాయవ్యవస్థ ద్వారా పదవి నుండి తొలగిస్తే అప్పటినుండి 60 రోజులలోపు అధ్యక్ష పదవికి ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సి ఉంటుంది. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ 2022లో దేశాధ్యక్షపదవికి బొటాబొటీ మెజారిటీతో గెలిచారు. ప్రతిపక్షాలు దేశ ద్రోహులుగా మారాయనీ, ఉత్తర కొరియా నియంత కిమ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనీ ఆయన ఇటీవల విమర్శలు చేస్తున్నారు. దేశంలో ఉన్న ద్రోహులను అణచివేసేందుకు మార్షల్ లా అమలు చేస్తున్నట్లు డిసెంబరు 3వ తేదీన ఆయన ప్రకటించారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయన తన మాటమీద నిలబడలేక నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. ఐనప్పటికీ దేశంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. దక్షిణ కొరియా పార్లమెంటు (జాతీయ అసెంబ్లీ)లో 204 మంది ఎంపిలు యూన్ సుక్‌ను అభిశంసించాలని నిర్ణయించగా, 85 మంది వ్యతిరేకించారు. దేశంలో మార్షల్ లా విధిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఆ నిర్ణయానికి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. ఐనప్పటికీ దేశంలో యూన్ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేక గాలులు వీస్తున్నాయి. తప్పుడు పని కూడా సక్రమంగా



చేయలేకపోయిన యూన్ సుక్‌ను స్వంతపార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, అత్యంత కిరాతకంగా హక్కులను అణచివేస్తూ ఎమర్జెన్సీ మార్షల్ లా విధించే సాహసం చేసిన దేశాధ్యక్షుడు ఇక పదవిలో కొనసాగడనికి వీలులేదని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇంతకుముందు ఒకసారి జాతీయ అసెంబ్లీ దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా ఒక తీర్మానం చేసింది. ఐతే అధికారపార్టీ దీనిని వ్యతిరేకించింది. ఇప్పుడు శనివారంనాడు తాజాగా ప్రతిపక్షం జాతీయ అసెంబ్లీలో దేశాధ్యక్షుణ్ణి అభిశంసిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానానికి 204 మంది అనుకూలంగా ఓటు వేశారు.

## ‘ఒకే దేశంఒకే ఎన్నిక’ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రమేయాన్ని తగ్గిస్తుందని ‘రాజ్యాంగ సవరణ (129) బిల్లు, 2024’ అండర్‌లైన్ చేయబడింది. కాగా129వ రాజ్యాంగ సవరణ బిల్లుకింద జమిలీ ఎన్నికల బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ప్రజలసభ (లోక్‌సభ)కు,రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రాజ్యాంగంలో కొత్త ఆర్టికల్‌ను చేర్చి మూడు ఆర్టికల్‌లను సవరించాలని ఈ బిల్లు కోరుతోంది. లోక్‌సభ, అన్ని శాసనసభలకు ఏకకాల ఎన్నికలతో కూడిన కొత్త ఆర్టికల్ 82ఏను చొప్పించాలని , ఆర్టికల్ 83(పార్లమెంట్ సభల వ్యవధి) ఆర్టికల్ 172 (రాష్ట్ర శాసనసభల వ్యవధి), ఆర్టికల్ 327(అధికారం)ను సవరించాలని బిల్లు ప్రతిపాదిస్తున్నది. శాసనసభల ఎన్నికలకు సంబంధించి పార్లమెంట్ నిబంధనలను రూపొందించాలి. ఇది అమలులోకి వచ్చిన తర్వాత లోక్‌సభ మొదటి సమావేశం తేదీని సాధారణ ఎన్నికల తేదీపై రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీచేయాలని , ఆ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ తేదీగా పిలుస్తారని కూడా ఇది అందిస్తుంది. ఈ నిర్ణీత తేదీ నుంచి లోక్‌సభ పదవీ కాలం5 సంవత్సరాల పాటు ఉంటుంది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలం ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయబడింది. నియమిత తేదీ తర్వాత, గడువు ముగిసే ముందు లోక్‌సభ పూర్తి పదవీకాలం ముగియడంతో ప్రజల సభ పూర్తి కాలం ముగుస్తుంది. ఆ తర్వాత ప్రజల సభ(లోక్‌సభ)కు, అన్ని శాసనసభలకు అన్ని సాధారణఎన్నికలు ఏకకాలంలో నిర్వహించబడతాయి.195152, 1957, 1962, 1967 సంవత్సరాలలో ప్రజల సభకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు సార్వత్రిక ఎన్నికలు ఏకకాలంలో జరిగాయని బిల్లు ప్రస్తావించింది.1968,1969లో కొన్ని శాసనసభలను ముందస్తుగా రద్దు చేసిన కారణంగా లోక్‌సభతో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే ప్రక్రియకు అంతరాయం కలిగింది’ అని అది గుర్తుచేసింది. మాజీ రాష్ట్రపతిరామ్‌నాథ్ కోవింద్‌నేతృత్వంలోని ‘ఒకే దేశంఒకే ఎన్నిక’ అనే అంశంపై ఉన్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నటుల బిల్లులకు సంబంధించిన ‘ఆబ్జెక్ట్స్ అండ్ రీజన్స్’ స్టేట్‌మెంట్ తెలిపింది.

## సర్వం సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

జరగనుంది. ఇంగ్లీష్, తెలుగు,ఉర్దూ భాషలలో పరీక్షను నిర్వహించనున్నారు. ఒఎంఆర్ విధానంలో జరిగే ఈ పరీక్షలో 150 ప్రశ్నలు ఉంటాయి. 783 గ్రూప్2 సర్వీసు పోస్టులకు గాను 5,51,847 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. 58 అదనపు రీజినల్ కో ఆర్డినేటర్లను, 245 లోకల్ రూట్ ఆఫీసర్లను, 1368 చీఫ్ సూరింటెండెంట్స్‌ను, 1556 మంది పరిశీలకులు, , 24,420 మంది ఇన్విజిలేటర్లను, 17,926 మంది పరీక్షకేంద్రాల వద్ద సిబ్బంది, 64 మంది ప్రత్యేక పరిశీలకులు, 4130 బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 18 మంది మానిటరింగ్ ఆఫీసర్లను మొత్తం 49,843 మంది సిబ్బందిని నియమి ంచారు. అలాగే జిల్లాలకు 33 మంది నోడల్ అధికారులను, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద 58 మంది అధికారులు, 245 మంది జాయింట్ లోకల్ రూట్ ఆఫీసర్లు ఉన్నారు. పరీక్షల నిమిత్తం మొత్తంగా 6865 మంది పోలీసులకు పలు బాధ్యతలను అప్పగించారు.

**నిరంతర నిఘా :** పరీక్ష పేపర్ల రికార్డ్ రూము నుంచి అభ్యర్థులకు ఒఎంఆర్ షీట్ చేరే వ రకు ప్రత్యేక నిఘా పెట్టారు. దీనికి సంబంధి ంచి రికార్డ్ రూముల నుంచి పరీక్ష కేంద్రాల వద్ద సిసికెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ఏర్పాట్లను ఇప్పటికే తనిఖీ చేశారు. ఏర్పాట్లు, ఎటువంటి లోపాలు రాకుండా ఇప్పటికే టిజిపిఎస్‌సి ప్రత్యేక దృష్టి పెట్టింది.

### ‘మెరిట్’ అభ్యర్థులను ఎవ్వరూ ఆపలేరు : బుర్ర

గ్రూప్2 పరీక్షలకు ఎటువంటి లోపాలు లే కుండా ఏర్పాట్లు పూర్తి చేశామని, పూర్తి వి శ్వాసం, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభ్యర్థులకు టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. మెరిట్ అభ్యర్థులను ఎ వ్వ రూ ఆపలేరని, ఒక్కపోస్ట్ ఉన్నా,ఆపోస్ట్తన దేననే విశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ప్రశ్నపత్రంలో ఏముందో తన తోపాటు ఎవ్వరికీ తెలియదని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకుని, తమ అధికారాలను విస్తృతంగా ఉపయోగించి,అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని, అభ్యర్థులెవ్వరూ అపోహాలు పెట్టుకోవద్దని భరోసనిచ్చారు. పరీక్షకు సుప్రీం,హైకోర్టుల నుంచి అన్ని అడ్డంకులూ తొలగిపోయాయన్నారు. ఇప్పటి వరకు 75 శాతం వరకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారన్నారు. గ్రూప్ 2 పరీక్షలకు 75 వేల మందికి పైగా సిబ్బంది పని చేస్తున్నారని,వ్యవస్థలపైన అభ్యర్థులు పూర్తి విశ్వాసం పెట్టుకోవాలన్నారు. అన్ని గ్రూప్ పరీక్ష ఫలితాలను మార్చిలోపు ప్రకటిస్తామని బుర్రా వెంకటేశం వెల్లడించారు.

ప్రపంచం

## సిరియా సమస్యపై జోర్డాన్‌లో
# ఉమ్మడి సమాలోచన

### స్వదేశానికి రష్యా సైన్యం



దమాస్కస్ : సిరియా నుండి రష్యా తన సైన్యాన్ని, సైనిక సామాగ్రిని స్వదేశానికి తరలించడం ప్రారంభించింది. సిరియాలో ఈనెల 8వ తేదీన తిరుగుబాటుదారులు పైచేయి సాధించి దేశాధికారాన్ని స్వాధీనం చేసుకోవడంతో దశాబ్దాలుగా అస్సాద్ కుటుంబ పరిపాలనకు మద్దతుగా నిలిచిన రష్యా సైన్యం వెనుదిరుగుతున్నది. సిరియా అధ్యక్షుడు అల్ బషర్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత జోర్డాన్ నగరం అక్వాబాలో శనివారంనాడు అరబ్, యూరోపియన్ యూనియన్, టర్కిష్, అమెరికా దేశాలకు చెందిన ఉన్నతస్థాయా దౌత్యవేత్తలు ఉమ్మడి సమావేశం నిర్వహించారు. రష్యా అండదండలతో సిరియాలో ఇన్నాళ్ళూ ప్రభుత్వం నడిచినందువల్ల ఆ దేశంలో కీలకమైన వ్యవస్థలు కుప్పకూలిసపోకుండా కాపాడాలని ఈసమావేశంలో నిర్ణయించారు.సిరియా తిరుగుబాటుదారులు తి రుగులేని వ్యూహం అమలు చేసి వరుసతా ఒకదానితర్వాత మరోనగరాన్ని స్వా ధీనం చేసుకున్నారు. చివరకు దేశాధికారాన్ని చేజిక్కించుకున్నారు. దీంతో ఈనెల 8వ న అల్‌బషర్ అసాద్ కుటుంబంతో సహా రహస్యంగా దేశంవదిలి ర ష్యాకు వెళ్ళిపోయారు. రష్యా సైన్యం తన సైనిక సామాగ్రినికి స్వదేశానికి తరలించడం ప్రారంభించింది. గడచిన 53 సంవత్సరాలుగా రష్యా, ఇరాన్ దేశాలు అస్సాద్ కుటుంబం సిరియాను పరిపాలించేందుకు అండగా నిలబడ్డాయి. మ రోవైపు శనివారం ఇజ్రాయెల్ సేనలు సిరియా సరిహద్దు ప్రాంతాలలో దాడులకు తెగబడ్డాయి. బర్జాహ్‌లో ఒక సైంటిఫిక్ ఇనిస్టిట్యూట్‌ను, సైనిక కేంద్రాన్ని ఇజ్రాయెల్ సేనలు ధ్వంసం చేశాయని ‘సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్’ ఒక ప్రకటనలో తెలియజేసింది. మరోవైపు టర్కీ దేశం వారం రోజుల తర్వాత సిరియా రాజధాని దమాస్కస్‌లో తన దౌత్యకార్యాలయాన్ని తెరిచేందుకు సిద్ధమైంది.

## జార్జియా కొత్త అధ్యక్షుడుగా మైఖేల్ కవెలాష్విలి



తిబ్లిసి : సంక్షోభంలో ఉన్న జార్జియా దేశానికి కొత్త అధ్యక్షుడు వచ్చారు. జార్జియా చట్టసభ సభ్యులు శనివారం నాడు దేశ కొత్త అధ్యక్షుడుగా మైఖేల్ కవెలాష్విలి (53) ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న డ్రీమ్ పార్టీ ఇంతకుముందే కవెలాష్విలిని అధ్యక్ష పదవికి అభ్యర్థిగా ఎంపిక చేసింది. అనుకున్నవిధంగానే నిర్ణీతప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. యూరోపియన్ యూనియన్‌లో జార్జియా సభ్యత్వం తీసుకునే విషయంలో దేశంలో మూడు వారాలుగా తీవ్ర ఆందోళన కొనసాగుతున్నది. యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకునే ప్రసక్తే లేదని అధికార డ్రీమ్‌పార్టీ భీష్మించుకుని కూర్చుంది. దీంతో డ్రీమ్‌పార్టీని రష్యా అనుకూలపార్టీగా ముద్రవేశారు. యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాల్సిందేనని డిమాండ్‌చేస్తూ దేశవ్యాప్తంగా మూడువారాలుగా అల్లర్లు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి ఇరాక్లీ కొబఖిడ్జే సారథ్యానగల ప్రభుత్వం అందుకు వ్యతిరేకిస్తున్నది. ఇందుకు సంబంధించిన చర్చలను వాయిదా వేసింది. 2028 వరకూ యూరోపియన్ యూనియన్‌కు నిధులు కూడా ఇవ్వకూడదని నిర్ణయించి నిషేధం అమలు చేస్తున్నది. ఈ ఆందోళనకర పరిస్థితులమధ్య డ్రీమ్ పార్టీ అనుకున్నవిధంగానే ముందుగా ప్రకటించినట్లుగానే కవెలాష్విలిని దేశాధ్యక్ష పదవికి ఎన్నుకుంది. పార్లమెంటులో డ్రీమ్‌పార్టీ ఆధిపత్యంలో ఉండటంతో కవిలాష్విలి ఎన్నిక చాలా సులభంగా పూర్తయింది. కవెలాష్విలి జార్జియా రాజకీయవేత్త, మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్.

## బిజెపి కాపాడుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

బొటనవ్రేళ్ళను కోసి బలితీసుకున్నట్లేనని అన్నారు. దేశంలోని వివిధ రంగాలలో అదానీ గ్రూపు ఆధిపత్యాన్ని, అదానీ ఏకస్వామ్యాన్ని సృష్టిస్తోందనీ, అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందనీ, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన ప్రదర్శనలు చేస్తున్న రైతులపై బాష్పవాయుగోళాలు ప్రయోగించి వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోందని విమర్శించారు. ఉద్యోగాల్లో దొడ్డిదారిన లేటరల్ ఎంట్రీ విధానం ప్రవేశపెట్టిందని, వివిధ పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీలకు ధారాళంగా అనుమతిస్తోందని, ఆ విధంగా ఏకలవ్యుడి బొటనవేలును కోసి బలి తీసుకున్నట్టుగా దేశంలో యువతరం నైపుణ్యాన్ని హరించివేస్తోందని రాహుల్‌గాంధీ విమర్శించారు. అదేతరహాలో యువ వ్యవసాయవేత్తలు, వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు, పేదలు అందరి నైపుణ్యాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బలి తీసుకుంటోందని రాహుల్‌గాంధీ విమర్శించారు. భారత రాజ్యాంగం తమకు రక్షణ ఇస్తుందని దేశంలోని ప్రతి పేదవాడికీ తాను చెప్పాలనుకుంటుంటే, బిజెపి ప్రభుత్వం మాత్రం వారంలో ఏడు రోజులూ, రోజులో ఇరవైనాలుగు గంటలూ రాజ్యాంగంపై దాడి చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత లోక్‌సభ సమావేశంలో తాను వాగ్దానం చేసినట్టుగానే, దేశంలో కులగణన జరిగి తీరుతుందని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని పూర్తిగా తొలగించివేస్తామని, తద్వారా దేశంలో సరికొత్త తరహా అభివృద్ధికి తెరలేస్తుందని రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. ‘‘మీ సర్వోన్నత నాయకుడు సావర్కర్ పేరు ఉటంకించడంతో నేను నా ప్రసంగాన్ని ప్రారంభిస్తాను, భారత రాజ్యాంగంపై ఆయనకు ఉన్న ఆలోచనలు, భారతదేశాన్ని ఏ విధంగా నడపాలని ఆయన ఆలోచించారు నే విషయాలను ప్రస్తావించడంద్వారా నేను నా ప్రసంగాన్ని ప్రారంభించాలనుకుంటున్నాను. ఆయన ఏం చెప్పారంటే, ‘అత్యంత హీనమైన విషయం ఏమిటంటే భారత రాజ్యాంగంలో భారతీయుల గురించి ఏమీ లేదు, వేదాల తర్వాత ఎంతో పూజ్యనీయమైన పురాతనకాలంనాటి గ్రంథం మనుస్మృతి, మన సంస్కృతి ఆరంభానికి, సంప్రదాయాలకు, ఆలోచనలకు, శతాబ్దాలనాటి ఆచరణకు అదే మూల గ్రంథం, భారతజాతి పురోగమనంలో అదెంతో పవిత్రమైనది, ఈనాడు మనుస్మృతే మన చట్టం’’ అని సావర్కర్ చెప్పారని రాహుల్‌గాంధీ అన్నారు. ‘‘భారత రాజ్యాంగంలో భారతీయుల గురించి ఎక్కడా లేదని సావర్కర్ తన రచనల్లో చెప్పారు, అందువల్ల ఆ పుస్తకాన్ని అంటే భారతదేశాన్ని నడిపించే ఆ రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుస్మృతిని ఆస్థానంలో ప్రవేశపెట్టాలని సావర్కర్ చాలా స్పష్టంగా తన రచనల్లో చెప్పారు’’ అని రాహుల్‌గాంధీ గుర్తుచేశారు. అందుకు వ్యతిరేకంగా తాము ఈ పోరాటమంతా చేస్తున్నామని రాహుల్‌గాంధీ అన్నారు. ‘‘ఇప్పుడు మీరు రాజ్యాంగాన్ని రక్షిస్తామని చెబుతున్నారు, చాలా బాగుంది, కానీ నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగదలచుకున్నాను, మీరు మీ సర్వోన్నత నాయకుడు సావర్కర్ చెప్పిన మాటలకు కట్టుబడి ఉంటారా? కానీ మరి మీరు ఇప్పుడు అందుకు భిన్నంగా రాజ్యాంగాన్ని రక్షిస్తామని చెబుతున్నారు, అంటే సావర్కర్‌ను మీరు ఎగతాళి చేస్తున్నారా? ఆయనను అపఖ్యాతిపాలు చేస్తున్నారా?’’ అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ‘‘మీ నాయనమ్మ ఇందిరా గాంధీ సావర్కర్ గురించి ఏమనుకున్నారు?’’ అని ఒక మహిళా ఎంపి అడిగిన ప్రశ్నకు రాహుల్‌గాంధీ సమాధానం చెబుతూ, బ్రిటిష్‌వారితో సావర్కర్ రాజీపడిపోయారని తన నాయనమ్మ తనకు చెప్పిందని అన్నారు. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని సావర్కర్ బ్రిటిష్‌వారికి రాసిన ఒక లేఖలో అడుక్కున్నారని, వారికి లొంగిపోయితననుతాను తాకట్టుపెట్టుకున్నారని అన్నారు. ‘‘గాంధీజీ జైలుకు వెళ్ళారు, నెహ్రూజీ కూడా జైలుకు వెళ్ళారు, కానీ సావర్కర్ మాత్రం బ్రిటిష్‌వారిని క్షమాభిక్ష అడిగారు’’ అని కూడా తనకు తన నాయనమ్మ ఇందిరాగాంధీ చెప్పారని రాహుల్ చెప్పారు. ‘‘నా మొదటి ప్రసంగంలో, యుద్ధం జరుగుతుందని చెప్పాను, మహాభారతాన్ని, కురుక్షేత్రాన్ని అభివర్ణించాను, ఈరోజున మన దేశంలో యుద్ధం జరుగుతోంది, మా వైపు నుండి చూసినప్పుడు రాజ్యాంగాన్ని రక్షించేవారంతా మావైపు ఉన్నారు.ప్రతి రాష్ట్రం నుండి రాజ్యాంగాన్ని రక్షించేవారంతా మాపక్షాన ఉన్నారు, తమిళనాడు గురించి అడిగితే మాకు పెరియార్ ఉన్నారు, కర్ణాటక గురించి అడిగితే మాకు బసవన్న ఉన్నారు, మహారాష్ట్ర గురించి అడిగితే మేం పూలే జీ పేరు చెబుతాం, అంబేద్కర్‌జీ పేరు చెబుతాం, గుజరాత్ గురించి అడిగితే, మేం మహాత్మాగాంధీ పేరు చెబుతాం’’ అని రాహుల్‌గాంధీ అన్నారు. ‘‘మీరు కూడా ఈ వ్యక్తులను ప్రశంసిస్తారు, కానీ జంకుతూ, సందేహిస్తూ ప్రసంసిస్తారు, కానీ వాస్తవం ఏమిటంటే, మీ అలవాటు ప్రకారం భారతదేశాన్ని మీరు కోరుకున్నట్లు నడిపించాలని మీరు భావిస్తున్నారు’’ అని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్‌లో తన పర్యటన అనుభవాలను రాహుల్‌గాంధీ సభలో ప్రస్తావిస్తూ, సామూహిక అత్యాచారానికి గురైన మహిళ, ఆమెకు టుంబాన్ని తాను కలిశానని చెప్పారు. ‘‘అత్యాచారానికి గురైన బాధితురాలు,ఆమె కుటుంబం ఎటు కదలకుండా ఇంట్లో బందీలుగా ఉండిపోతే, నిందితులు మాత్రం విచ్చలవిడిగా వీధుల్లో తిరుగుతున్నారు, అత్యాచారానికి గురైన బాధిత కుటుంబం బందీగా ఇంటికే పరిమితమై ఉండిపోవాలని రాజ్యాంగంలో ఎక్కడ రాసి ఉంది? బహుశా ఇదంతా మీ (బిజెపి) పుస్తకంలో రాసి ఉండి ఉంటుందేమోతప్ప రాజ్యాంగంలో మాత్రం రాసిలేదు’’ అని విమర్శించారు. ప్రభుత్వం గనుక ఎలాంటి చర్యలూ తీసుకోకపోతే ‘‘ఇండియా’’ కూటమి ఆ బాధిత కుటుంబానికి పునరావాసం కల్పిస్తుందని రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. సంభాల్‌లో జరిగిన హింసను కూడా రాహుల్‌గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. అమాయకులైన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు, సమాజంలో బిజెపి విభజనలను, విభేదాలను సృష్టిస్తోందన్నారు.‘‘ఇండియా’’కూటమి సిద్ధాంతమే దేశానికి రాజ్యాంగాన్ని అందించింది, అందువల్ల మేం అందరం సమైక్యంగా రాజ్యాంగాన్ని రక్షించుకుంటాం అని రాహుల్ అన్నారు. ‘‘ఒకవేళ రాజకీయ సమానత్వం ఉంటే సాంఘిక, ఆర్థిక సమానత్వం ఉండదు, రాజకీయ సమానత్వం నాశనం అవుతుంది’’ అనేవి అంబేద్కర్ చెప్పిన మాటలు, ఈనాడు రాజకీయ సమానత్వం అంతమైందని స్పష్టమైపోయింది, ఇకఎలాగో సాంఘిక సమానత్వం, ఆర్థిక సమానత్వం అనేవి లేనేలేవు, అందువల్ల ఇక మా తదుపరి అడుగు ‘‘కుల గణనే’’. ఇక మీరు ఎవరి బొటనవ్రేళ్ళను కోసి బలితీసుకుంటారనే విషయాన్ని మేం ఈ దేశానికి చూపించదలచుకున్నాం, దళితులు,ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, రైతులు, కార్మికులు..ఇలా ఎవరిఇ బొటనవ్రేళ్ళు ఈ ప్రభుత్వం కత్తిరిస్తుందో ఈ దేశానికి మేం చూపించదలచుకున్నాం’’ అని రాహుల్‌గాంధీ అన్నారు. రాహుల్‌గాంధీ తన ప్రసంగపాఠాన్ని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ‘‘కాంగ్రెస్, ‘‘ఇండియా’’ కూటమి రాజ్యాంగ రక్షకులు, బిజెపి–ఆర్ఎస్ఎస్ రెండూ మనుస్మృతికి మద్దతుదారులు, ఈ దేశం భారతరాజ్యాంగంద్వారా నడపబడుతున్నదిగానీ, మనుస్మృతిద్వారా కాదు’’ అని రాహుల్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.లోక్‌సభలో రెండోరోజు శనివారంనాడు కేంద్రమంత్రి కిరెణ్ రిరిజు రాజ్యాంగంపై చర్చను పునః ప్రారంభించారు. ప్రపంచవేదికపై భారతదేశ ప్రతిష్టకు తమ మాటలుగానీ, చేతలుగానీ భంగం కలిగించబోవని ఆయన అన్నారు. గంటకుపైగా ఆయన ప్రసంగించారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్‌పార్టీ అవమానించిందని, ఆయనకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని అన్నారు.

## టిజిపిఎస్‌సిలో నూతన సంస్కరణలు

**18,19న యుపిపిఎస్‌సి, ఎస్ఎస్‌సి,ఆర్‌టిఐ, ఎన్‌టిఎ చైర్మన్లతో సమావేశం**
**మీడియా సమావేశంలో టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్:జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు,భర్తీ విధానాన్ని లోతుగా అభ్యయనం చేసేందుకు టిజిపిఎస్‌సి ప్రతినిధి బృందం ఈ నెల 18,19న న్యూఢిల్లీకి వెళ్లనున్నట్టు టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. యుపిఎస్‌సి, స్టాఫ్ సెలెక్షన్ (ఎస్ఎస్‌సి), నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ), ఆర్‌టిఐ సంస్థల ఛైర్మన్లతో సమావేశమై, పరీక్షల నిర్వహణ, సిబ్బంది, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై వారితో చర్చించి,నూతన సంస్కరణలను ప్రవేశపెడుతామని తెలిపారు. హైదరాబాద్‌లోని టిజిపిఎస్‌సి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిజిపిఎస్‌సి సభ్యులు వై.రాంమోహన్‌రావుతో కలిసి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ యుపిపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఎన్‌టిఎ,ఆర్‌టిఐ సంస్థల ఛైర్మన్లతో మాట్లాడిన తర్వాత జనవరిలో టిజిపిఎస్‌సికి సంబంధించి పరీక్షల నిర్వహణ, భర్తీ,భద్రత అంశంలో ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను సమర్పిస్తామని వెల్లడించారు. యుపిపిఎస్‌సి ప్రతి ఏటా కేవలం 5 వేల ఉద్యోగాలకు మాత్రమే పరీక్షలను నిర్వహిస్తుందని వివరించారు. టిజిపిఎస్‌సిని సంస్థ పరంగా మరింత పటిష్టం చేస్తామన్నారు. ఈ నెల 18న ఉదయం యుపిపిఎస్‌సి ఛైర్మన్‌తో సమావేశమై, పరీక్ష విధానానికి అవలంభిస్తున్న విధానాన్ని, నియమ నిబంధనలు,న్యాయపరమైన చిక్కులను ఎలా పరిష్కరిస్తున్నారో అధ్యయనం చేస్తామన్నారు. ఆ తర్వాత ఆర్‌టిఐ ఛైర్మన్‌తో సమావేశమై, ఆ మరుసటి రోజు ఈనెల 19న ఉదయం ఎస్ఎస్‌సి ఛైర్మన్, ఆ తర్వాత ఎన్‌టిఎ ఛైర్మన్‌తో సమావేశం కానున్నట్టు బుర్రా వెంకటేశం వివరించారు. కేరళ రాష్ట్రంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సుమారు రెండు వేల మంది సిబ్బంది ఉన్నారని, తమ వద్ద కేవలం 250కి పైగా ఉన్నారని, మరో 80 మందిని డిప్యూటేషన్ పద్ధతిలో తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. టిజిపిఎస్‌సి పరీక్ష విధానాన్ని అధ్యయనం చేసేందుకు కర్నాటక, మహారాష్ట్ర, యుపి రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రతినిధులు రానున్నారన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల నుంచి ఫలితాల వరకు మొత్తం ప్రక్రియను ఆరు నుంచి 9 నెలల్లో ,అలాగే కేవలం సింగిల్ పరీక్ష మాత్రమే ఉంటే ఆరు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తయ్యేలా కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర, ఇతర ఉద్యోగ పోటీ పరీక్షలు ఒకే రోజు నిర్వహించడంతో అభ్యర్థులకు నష్టం జరుగుతుందని, ఇలా జరగకుండా ఉండేలా ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అంశాన్ని యుపిపిఎస్‌సి దృష్టికి తీసకెళ్తామని బుర్రా వెంకటేశం తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి గత చరిత్ర మసకబారినప్పటికీ, ఈ ఏడాది కాలంలోనే 13వేల పోస్టులను భర్తీ చేయడం ఒక చరిత్ర అని అన్నారు. భవిష్యత్‌లో టిజిపిఎస్‌సి అంటే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, అభ్యర్థుల్లో విశ్వాస్వాన్ని కల్పిస్తామని, ఒక సారి నోటిఫికేషన్ జారీ చేస్తే, తేదీలు ప్రకటిస్తే, తప్పకుండా జరుగుతందనే భరోసను ఉండేలా పరీక్ష విధానాన్ని రూపొందిస్తామని బుర్రా వెంకటేశం వివరించారు. గ్రూప్ పరీక్షలకు ఏ పుస్తకాలు చదవాలనే విషయాన్ని తాము చెప్పబోమని, కేవలం సిలబస్‌ను మాత్రమె చెబుతామని స్పష్టం చేశారు. సిబిటి పరీక్ష నిర్వహించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రాష్ట్రంలో కేవలం 28వేల మంది మాత్రమే కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాసేందుకు అవకాశం ఉన్నదని, గ్రూప్ 2 పరీక్షలకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తే 25 రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉన్నదని, తద్వారా పలు అనుమానాలకు దారి తీస్తుందని బుర్రా వెంకటేశం ఈ సందర్భంగా అన్నారు.

## రాజ్యాంగానికి తూట్లు!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ఆయన ఆ విమర్శలు చేసిన సమయంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ కూడా లోక్‌సభలో కూ ర్చుని ఉన్నారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన ఇంకా అనేకమంది తన లాంటి నాయకులు రాజ్యాంగాన్ని పటిష్టం చేయడం తప్ప ఎన్నటికీ వారిలాగా చేయలేరని అన్నారు. తన సుదీర్ఘజీవితంలో విలువలకు కట్టుబడి కొనసాగానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన ప్రభుత్వం భారత రాజ్యాంగ 60వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించిందని, ఆ సందర్భంగా రాజ్యాంగ ప్రతిని ఏనుగు అంబారీపై ఉంచి ఊరేగించామని గుర్తుచేసుకున్నారు. తాను ఈ ఏనుగు అంబారీ వెంట చెప్పులు లేకుండా నడిచి రాజ్యాంగానికి ఉన్న సర్వాధిపత్యాన్ని, రాజ్యాంగం పట్ల తనకు ఉన్న గౌరవాన్ని చాటి చెప్పుకున్నానన్నారు. భావప్రకటనాస్వేచ్ఛను అడ్డుకునేందుకు భారతదేశ మార్గదర్శకగ్రంథాన్ని జవహర్‌లాల్ నెహ్రూ సవరించారని, ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సుప్రీం కోర్టు తీర్పును కూడా తిరస్కరించి దేశంలో ఎమర్జెన్సీని విధించారని అన్నారు. లోక్‌సభ సభ్యురాలుగా ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసినందుకుగాను ఆమె ఇంతపని చేశారన్నారు. ‘‘రాజ్యాంగానికి ఆమోదముద్రపడి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సమయంలో ఆమె తన ప్రధానమంత్రి పదవి అధికార కుర్చీని కాపాడుకోవడంకోసం భారతదేశ ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారు, రాజ్యాంగం మూగబోయేట్టు చేశారు,ఎవరూ తమ అధికారాలను సవాలు చేయకుండా ఉండటం కోసం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి పదవులకు రక్షణ కల్పించుకోవడానికి సవరణ తీసుకువచ్చారు, ఆనాడు ఈ దేశమే ఒక జైలుగా మారింది, న్యాయవ్యవస్థ గొంతు నులిమేశారు, తల్లి హత్యానంతరం దేశాధికారాన్ని తీసుకున్న రాజీవ్‌గాంధీ కూడా రాజ్యాంగానికి సవరణలు చేశారు, ఈ మచ్చను కాంగ్రెస్‌పార్టీ కడిగిపారేయలేదు’’ అని మోదీ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ నాయకత్వానగల యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక దురంహంకారంగల వ్యక్తి మంత్రివర్గ నిర్ణయం రాసి ఉన్న కాగితాన్ని చించిపారేశారు అని రాహుల్‌గాంధీ పేరును ప్రస్తావించకుండా మోదీ విమర్శించారు. ఆనాడు యుపిఎ ప్రభుత్వంలో మన్‌మోహన్‌సింగ్ ప్రధానమంత్రి బాధ్యతల్లో ఉన్నారని గుర్తుచేశారు. యుపిఎ పరిపాలనాకాలంలో సోనియాగాంధీ నాయకత్వానగల జాతీయ సలహా మండలి మంత్రివర్గకంటే అత్యున్నతస్థానంలో ఉండి శాసించారని విమర్శించారు. దేశ ఐక్యత, సమగ్రతల ప్రయోజనాలకోసం మతం, విశ్వాసం ప్రాతిపదికపై రిజర్వేషన్లను రద్దు చేయాలని రాజ్యాంగ నిర్మాతలు భావించి నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్‌పార్టీ మాత్రం తన అధికార దాహంతో, ఓటుబ్యాంకు బుజ్జగింపు రాజకీయాలతో రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం దేశాన్ని ఐక్యం చేయడం కోసం రాజ్యాంగంలో ఉన్న 370వ అధికరణను రద్దుచేసిందని, జిఎస్‌టిని అమలులోకి తీసుకువచ్చిందని, ఒకేదేశం, ఒకే పన్ను విధానం అమలులోకి తీసుకువచ్చిందని అన్నారు. 1949లో రాజ్యాంగానికి ఆమోద్రముద్ర పడినప్పటినుండీ దేశం చేసిన సుదీర్ఘమైన ప్రయాణాన్ని మోదీ ఎంతగానో కీర్తించారు. భారతదేశంలో పురాతనకాలం నుండి వేళ్ళూనుకున్న ప్రజాస్వామ్య మూలాలు ప్రపంచానికి దీర్ఘకాలంగా సూర్తిగా నిలిచాయన్నారు. భారతదేశం కేవలం ఒక అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం మాత్రమేకాదనీ, ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిదనీ అన్నారు. 2047వ సంవత్సరంనాటికి భారతదేశం అభివృద్ధిచెందిన దేశంగా రూపుదాల్చాలని తీర్మానించుకుందని గుర్తుచేశారు. ఈ లక్ష్యసాధనకు దేశ ఐక్యత ఎంతో ముఖ్యమైనదని అన్నారు. మనదేశ రాజ్యాంగం దేశ ఐక్యతపైనే ఆధారపడి ఉందని మోదీ అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజాస్వామ్యం గురించి వ్యక్తమైన భయాలన్నింటినీ దేశం తిరస్కరించిందనీ, ఆ తర్వాత భారత రాజ్యాంగం ఈనాటికి దేశాన్ని ఈ స్థాయిలో అభివృద్ధిలోకి తీసుకువచ్చిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాతలకు ఆయన నివాళులు అర్పించారు.

భారతదేశం 1947లో జన్మించలేదని, 1950లో ప్రజాస్వామ్యదేశంగా అవతరించలేదని రాజ్యాంగాన్ని రచించిన నిర్మాతలకు బాగా తెలుసునని అన్నారు. పురుషోత్తమదాస్ టాండాన్, భీమారావ్ అంబేద్కర్ వంటి గొప్ప రాజ్యాంగ నిర్మాతలపేర్లను ఈ సందర్భంగా మోదీ ఉటంకించారు. రాజ్యాంగం ద్వారా దేశంలో మహిళలకు కూడా ఓటు హక్కు ఇచ్చారని, ఈనాడు దేశం మహిళల నాయకత్వంలో అభివృద్ధిని చవిచూస్తోందని అన్నారు. మహిళలకు లోక్‌సభలో, రాష్ట్రాల అసెంబ్లీలలో రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి చట్టం రూపంలోకి తీసుకువచ్చిన పార్లమెంటేరియన్లను ఈ సందర్భంగా నరేంద్రమోదీ శ్లాఘించారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ పంపిణీ చేశారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్ సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 88 మంది లబ్దిదారులకు మంజూరైన రూ.24,16500 చెక్కులను మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో కలిసి ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యాలపాలైన నిరుపేదలకు సిఎం సహాయ నిధి ద్వారా కొంతైనా ఆర్థిక వెసులుబాటు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ నాడు లక్షలాది రూపాయల చెక్కులను విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన సిఎం సహాయనిధి చెక్కులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించడంలేదన్నారు. అనారోగ్యంపాలై లక్షల్లో ఖర్చయినా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.60వేలకు మించి ఇవ్వడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, పెంట్యాల పుల్లయ్య, లక్కారెడ్డి, బాశబోయిన వీరన్న, వెంకటప్పారావు, మురళీకృష్ణ, బ్రహ్మం, బోడపోతుల బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఇందిరా నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో టిజివోస్, టిఎన్‌జివోస్ నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతికి, ప్రేమకు, సహనానికి ఏసుక్రీస్తు నిదర్శనమన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిజివోస్ జిల్లా కార్యదర్శి వేలాద్రి, టిఎన్‌జీవోస్ జిల్లా నాయకులు కె. శ్రీనివాస్, జి. శ్రీనివాస్, ఆయూష్ ప్రకాష్, గౌరవాధ్యక్షులు వల్లపు వెంకన్న, యర్రా రమేష్, కోడి లింగయ్య, నాగేశ్వరరావు, కార్యదర్శి వెంకటరమణ, డ్రైవర్ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

డిఎస్ఒ చందన్‌కుమార్

**ప్రజాపక్షం/ చింతకాని :** కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అన్న పెద్దల నానుడిని నిజం చేస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిఎస్ఒ చందన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం చింతకాని మండలం నాగులవంచ బాలుర వసతి గృహంలో ఆయన నూతన మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్ఒ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మంచి భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో మెనూ చార్జీలను రెట్టింపు చేసిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ జానిమియా, టైపిస్టు మీరా, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

* ఎంఆర్‌పిఎస్ డిమాండ్

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చంగల గురునాథం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జూలూరుపాడు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దేబ్బెందల సాయికుమార్ అధ్యక్షతన జరిగినటువంటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరి వాటాలు వారికే ఇవ్వాలని సుప్రీం కోర్టే చెప్పింది.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేట్ ఎందుకు చేస్తుంది.. మాల మేధావులారా మంచిని ఆహ్వానిద్దాం.. అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చి రాష్ట్రాలకు పూర్తి అధికారాలు ఇవ్వగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం ఎందుకు చేస్తుందో ఎవరికీ అర్థంకానటువంటి పరిస్థితి అని అన్నారు. భారతదేశంలో ఉన్న కొన్ని రాష్ట్రాలలో అత్యధికంగా మాలలే ఎక్కువగా జనాభా ఉన్నారని వారికే మేలు జరుగుతుందని ఆయన అన్నారు. వర్గీకరణకు ఎస్సీ, ఎస్టీ అన్ని కులాల నాయకులు సహకరించాలని ఆయన అణగారిన వర్గాల కులాల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దెబ్బెందల సాయికుమార్, మాజీ మండల అధ్యక్షులు చాపల మడుగు రామ్మూర్తి, మాజీ మండల అధ్యక్షులు కాకటి కృష్ణ, శివ, నరేందర్,చంగల్ నరసింహారావు పాల్గొన్నారు.



## గంజాయి రవాణా నిందితులు అరెస్ట్

**ప్రజాపక్షం / సత్తుపల్లి :** గంజాయి రవాణా అమ్మకాలు జరుపుతున్న 6గురు వ్యక్తులను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ శివార్లలోని వేంసూరు రోడ్డులో గల మెట్టాంజనేయ స్వామి ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సమీపంలోని మామిడి తోటలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న 6గురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో మండల పరిధిలోని నారాయణపురంకు చెందిన ఆరుమళ్ళ తరుణ్‌కుమార్, సిద్దారం గ్రామానికి చెందిన జంగం అఖిల్, రేజర్ల గ్రామానికి చెందిన కలపాల రాంబాబు, సత్తుపల్లి మున్సిపాలిటిలోని ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం, రేజర్ల గ్రామానికి చెందిన జుంజునూరి సింహాద్రి, వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన శ్రీనాద్ ఉన్నట్లుగా ఏసిపి రఘు, సిఐ కిరణ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి వద్ద నుండి 111.29 గ్రాముల గంజాయి, రూ.2782 నగదు, రెండు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాదీన పరుచుకున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దశలవారీ ఆందోళన

26 నుంచి సిపిఐ శతజయంతి కార్యక్రమాలు

సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం :** డిసెంబర్ 26 నుంచి ఏడాది పొడవునా సిపిఐ శత జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. డిసెంబర్ 26న భారత కమ్యునిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన, రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాత్, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శుక్రవారం జరిగిన జిల్లా సమితి నిర్ణయాలను ఆయన వెల్లడించారు. పార్టీ శత వసంతాల సందర్భంగా అన్ని గ్రామాల్లో పతాకావిష్కరణ చేస్తామని ఏడాది పొడవునా కవి సమ్మేళనాలు, సెమినార్లు నిర్వహించి పార్టీ గత చరిత్రను, సాధించిన పోరాట విజయాలను నేటి తరాలకు తెలియజేస్తామన్నారు. ఈనెల 30న శతజయంతి రాష్ట్ర స్థాయి ప్రారంభ సభ నల్లగొండలో జరుగుతుందని సురేష్ తెలిపారు. మద్దతు ధరల హామీ చట్టాలని అమలుచేయకుండా రైతులపై లాఠీ చార్జి, భాష్పవాయువు ప్రారంభించి అణిచివేయాలని చూస్తున్నారని, ఢిల్లీ సరిహద్దులలో సాగుతున్న రైతాంగ ఆందోళనకు సిపిఐ పూర్తి మద్దతు నిస్తుందన్నారు.

ఏడాది కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని సురేష్ తెలిపారు. రైతు భరోసా ఖరీఫ్‌లో రైతుల ఖాతాలో జమ చేయలేదని, రబీ సీజన్ ప్రారంభమైందని, వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ అందించడంతో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు, ఎఎన్ఎంలకు, స్కీమ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సురేష్ కోరారు. గత వారం రోజులుగా సమ్మె చేస్తున్నా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సిపిఐ మద్దతు ప్రకటిస్తుందని వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకముందే సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలపై దశలవారీగా ఆందోళన చేపడతామన్నారు. స్థానిక సంస్థలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు సురేష్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం పాల్గొన్నారు.

## మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం

**ప్రజాపక్షం/పాల్వంచ:** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం కోరారు. శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘం (కెఐటియుసి) సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర రేట్లుకు అనుగుణంగా వారికొచ్చే జీతాలు సరిపోట్లేదని, సమాన పనికి సమాన వేతనం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి కార్మికుడికీ ఇపిఎఫ్ ఇఎస్ఐ నగదు చెల్లించి వారికి రసీదులు అందించాలని, స్వచ్ఛభారత్ పేరుతో ఇంటింటి చెత్త సేకరిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి మున్సిపాలిటీ నుంచి వేతనాలు చెల్లించాలని, హరితహారం పేరుతో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. జాతీయ కనీస వేతనం చట్టం ప్రకారం అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యాలకు, పారిశ్రామికవేత్తలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, కార్మిక సంఘం నాయకులు రామయ్య, గంగపురి వెంకన్న, రమేష్, మాడుగుల ప్రసాద్ పాల్గొన్నారు.

## మాట తప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ చింతకాని :** గాడ్సేల పాలనలో గాంధేయ మార్గం అనుసరించడం సాధ్యం కాదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చింతకాని మండలం బస్వాపురంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన మాట తప్పాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలు రద్దు చేస్తామని చెప్పి నేటికీ రద్దు చేయలేదని అన్నారు. ఢిల్లీ హర్యానా సరిహద్దుల్లో నిరసన తెలియచేస్తున్న రైతులను అడ్డుకుంటున్నారని హంగర్ స్ట్రైక్ చేస్తున్న రైతు నాయకుడు జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందన్నారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం రైతులు గాంధేయ మార్గంలో ఆందోళన నిర్వహించమని చెప్పడం ప్రస్తుత గాడ్సే వారసుల పాలనలో సాధ్యమా అన్నారు. వ్యవసాయ సాగు వ్యయం పెరగడంతో రైతులు నష్టాలపాలయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, తక్షణమే రైతు భరోసా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మార్గం శ్రీను, బస్వాపురం గ్రామ కార్యదర్శి బద్దల నర్సింహారావు, మామిడాల యాలాద్రి, నర్సింహారావు, పదిమల వెంకటనర్సయ్య, ఆవుల మంగయ్య, అమర్లపూడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లు, గురుకులాలకు కొత్త మెనూ

నెలలో రెండు సార్లు మటన్, నాలుగుసార్లు చికెన్

విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందేలా మార్పులు

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంఇఒ ఎదు సింహారాజు




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు శనివారం నుండి కొత్త మెనూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు అమలవుతున్న డైట్‌లో అనేక మార్పులు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం మెనూ సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు శనివారం ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల నందు మండల విద్యాశాఖాధికారి ఎదు సింహారాజు నూతన మెనూను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌లాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంచ్‌లో నెలలో రెండుసార్లు మటన్, నాలుగు సార్లు చికెన్ పెడుతున్నారని అన్నారు. అలాగే బ్రేక్ ఫాస్ట్‌లో రోజుకో తీరుగా కిచిడీ, చపాతీ, ఇడ్లీ, వడ, బోండా, పూరి, పులిహోర లాంటి టిఫిన్‌తో పాటు రాగిజావ లేదంటే పాలు విత్ బూస్ట్ ఇవ్వనున్నారని తెలిపారు. బ్రేక్ టైంలో ఏదైనా పండుతో పాటు స్నాక్స్ టైంలో రోజుకో ఐటెం తీరుగా బాయిల్ట్ పల్లీలు, పెసర్లు, బఠానీలు, మిల్లెట్ బిస్కట్లు, అల్లం టీం అందించనున్నారని పేర్కొన్నారు. ఈ కొత్త మెనూ ప్రభుత్వ హాస్టళ్లలో అమల్లోకి వచ్చినందున నెలలో ఒక్కో వారానికి ఒక్కో మెనూ చొప్పున నాలుగు వారాలకు చార్జ్‌ను రూపొందించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి లంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు దాసు, రాము, హరికృష్ణ, రమేష్, పలువురు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టల్ వ్యవస్థను తీసుకొచ్చింది ఇందిరాగాంధీ

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** భారతదేశంలో తొలిసారిగా హాస్టల్స్ వ్యవస్థను తీసుకొచ్చింది స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం వైరా మండలం ముసలిమడుగు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పెంచిన మెనూ, కాస్మోటిక్ అమలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధవీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలో వసతిగృహాల్లో విద్యార్థినీ, విద్యార్థులు చాలీచాలని మెస్ చార్జీలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చిందని, ఇందిరమ్మ పాలనలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలవుతుందని తెలిపారు. విద్యార్థినిల తల్లిదండ్రులు మాట్లాడుతూ నూతన మెనూ పెంపుదల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, డిఎల్‌పివో రాంబాబు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు దీపిక, ఆర్ఐ మెచ్చా వెంకటేశ్వరరావు, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఫణితి సైదులు, దాసరి దానియేలు, బోళ్ళ గంగారావు, బిడికె.రత్నం, మల్లు రామకృష్ణ, మచ్చా బుజ్జి, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, తడికమళ్ళ నాగేశ్వరరావు, పమ్మి అశోక్, జవ్వాజి నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పుణ్యవతి, పిడి స్వరూప, నవీన, కవిత పాల్గొన్నారు.

## పంటలసాగులో ఆదర్శంగా రాష్ట్రం



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** దేశంలో ఉన్న అన్ని రకాల పంటలసాగులో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో జరిగిన వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశ్యంతో వ్యవసాయ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎక్కువ మంది ఉద్యోగులు అశ్వారావుపేట కళాశాల నుండి వచ్చారని చెప్పుకోవటం గర్వంగా ఉన్నప్పటికీ రైతులకు మాత్రం సరైన పరిజ్ఞానం అందటం లేదని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి నా శక్తికి మించి పనిచేస్తానని అన్నారు. త్వరలోనే వ్యవసాయశాఖలో ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే అనుమతులు మంజూరు చేశారని, ఆర్థికశాఖ నుండి అనుమతి రావాల్సి ఉందని తెలిపారు. భవిష్యత్‌లో వ్యవసాయం ఉద్యోగంగా ప్రతిఒక్కరూ భావించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఉన్నత ఉద్యోగులు, రాజకీయ నేతలు సైతం ఫామ్ హౌజ్‌లు కట్టుకుని వ్యవసాయం చేస్తున్నారని ఉదాహరించారు. వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సేవలు దేశ రైతాంగానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ప్రజా సంక్షేమానికి ప్రాధ్యానతనిస్తానని స్పష్టం చేశారు. వ్యవసాయం అనుబంధ రంగాల అభివృద్ధికి మంత్రి తుమ్మలను సమన్వయం చేసుకుని పనిచేస్తానని తెలిపారు.

అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.రాజిరెడ్డి, కలెక్టర్ జితేష్ బిపాటిల్, ఐటిడిఎ పిఒ రాహుల్, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పెరిక సింగారం బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని పెరిక సింగారం గ్రామంలో శనివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టోత్సవ కార్యక్రమంలో, దేవాలయాల ప్రారంభోత్సవంలో రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహించిన హోమ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ దేవాలయాల ప్రతిష్ట కార్యక్రమం బంగారు మైసమ్మ ఆలయాల దగ్గర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపిపి జూకూరు గోపాలరావు, కంచర్ల జీవన్ రెడ్డి, చాట్ల పరుశురాం, మాజీ ఎంపిటిసి సభ్యులు మోదుగు వీరభద్రం, మాజీ సర్పంచ్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, ఎఎంసి డైరెక్టర్ తిప్పల సరోజన, కందులూరి లక్ష్మీనారాయణ, ఉపేందర్, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అప్పుల బాధతో పురుగు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రఘునాథపాలెం మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గునిపిన్ని భూపతిరావు (30) తనకున్న పొలంతో పాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని గత కొన్నేళ్లుగా మిర్చి సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా మిర్చి సాగు చేశాడు. మిర్చికి వైరస్ సోకి ఎండిపోవడంతో పెట్టుబడుల కోసం, ఇతర అవసరాల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో శనివారం తాను కౌలుకు తీసుకున్న పొలం వద్దకు వెళ్లి పురుగు మందు సేవించాడు. అట్టి విషయాన్ని భార్య సాయికుమారికి ఫోన్‌లో తెలపడంతో వెంటనే కుటుంబ సభ్యులకు ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. మృతునికి ఓ కుమారుడు ఉన్నాడు. మృతుని తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంఎల్ఎ పాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** వికలాంగులకు, ఒంటరి మహిళలకు నిరుపేదలైన వారికి మొదటి ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పినపాక ఎంఎల్ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని సారపాక పట్టణంలో పలు ప్రాంతాలలో ఇటీవల సిసి రోడ్లు నిర్మాణం చేపట్టినటువంటి సుమారు 60లక్షల రూపాయల విలువ గల రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం తాళ్ల గొమ్మూరు పంచాయితీలోని ఐటిసి నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం సారపాక పట్టణ ప్రజలు లోవోల్టేజీ సమస్యలతో ప్రతి రోజు ఇబ్బంది పడుతుండగా సుమారు 20లక్షల రూపాయల విలువతో 160కెవి రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడంతో వాటిని ప్రారంభించారు. అదే విధంగా ముసలమడుగు బస్టాండ్ ప్రాంతంలో ఐటిసి నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తన క్యాంపు కార్యాలయంలో వచ్చి సమస్యని విన్నవించుకోవాలని, ఎలాంటి మధ్య వ్యక్తులను కలవద్దని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి, ఐటిసి ఉన్నతాధికారి చెంగల్‌రావు, పంచాయితీ రాజ్ డిఇ వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి.కృష్ణారెడ్డి, పినపాక బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, టిపిసిసి సభ్యులు తాళ్లూరి చక్రవర్తి, మాజీ జెడ్‌పిటిసి బట్టా విజయ్‌గాంధీ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బి బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లకొండ వాసుదేవరావు, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు బాదం రమేష్‌రెడ్డి, చల్లా వెంకటనారాయణ, కణితి కృష్ణ, ఇంగువ రమేష్, భజన ప్రసాద్ కుమార్, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, పూలపల్లి సుధాకర్‌రెడ్డి, కైపు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్, లాలయ్య, వీరారెడ్డి, సున్నం మోహన్ రావు, యాకూబ్ పాషా, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, దాసరి సాంబ, చిప్పారాజు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హోరా హోరీగా స్టేట్ లెవల్ టెన్నీస్ బాల్ టోర్నమెంట్

మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందించిన ఆకోజ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి లైట్ వెయిట్ టెన్నీస్ బాల్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా శనివారం స్కూల్ సేన, బిక్షు లెవన్ మధ్య హోరా హోరీ మ్యాచ్ సాగింది. ఈ పోటీలో స్కూల్ సేన జట్టు ఘన విజయం సాధించింది. జట్టు విజయం కోసం కీలక పాత్ర పోషించిన చంద్రకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ అవార్డును బిఆర్ఎస్ పట్టణ నాయకులు ఆకోజ్ సునీల్ కుమార్ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో పోటీతత్వం పెరుగుతుందని, ఆ పోటీలో విజయం సాధించిన వారు మరిన్ని విజయాలు తమ ఖాతాలో వేసుకోవాలని, ఓటమి పాలైన వారు మరింత మెలుకువతో ఆట తీరు ప్రదర్శించి గెలుపొందేందుకు ప్రయత్నించాలని అన్నారు. ప్రతీ ఓటమి ఓ గెలుపునకునాంది అని, ఓడినంత మాత్రాన కుంగిపోవాల్సిన పనిలేదని, పడిలేచే కెరటంలా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, విశ్వనాథ్, కిరణ్ తదితరులున్నారు.

